# పల్లాకు నిరసన సెగ

సమస్యలపై నిలదీసిన జనం

అభివృద్ధి ఎక్కడ అంటూ ఫ్లెక్సీల ఏర్పాటు



2 లో




మనం

మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

శనివారం | 28 | అక్టోబర్ | 2023 | పేజీలు : 8


## కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారు

పటాన్‌చెరు అభ్యర్థి మినహా అన్ని స్థానాలకు ఎంపిక



పూజల హరికృష్ణ (సిద్దిపేట)



పొన్నం ప్రభాకర్ (హుస్నాబాద్)



చెరుకు శ్రీనివాస్‌రెడ్డి (దుబ్బాక)

సిద్దిపేట, అక్టోబర్ 27, మనం న్యూస్ ప్రతినిధిః కాంగ్రెస్ పార్టీ నుండి రాబోయే ఎన్నికల్లో అభ్యర్థులుగా పోటీ చేసే వారెవరో తేలిపోయింది. కాంగ్రెస్ మొదటి జాబితా, రెండవ జాబితాలో దాదాపు ఉమ్మడి మెదక్ జిల్లాలోని పటాన్‌చెరు మినహా అన్ని స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్టే. రెండవ విడత జాబితాలో సిద్దిపేట నియోజకవర్గం నుండి పూజల హరికృష్ణ, దుబ్బాక నియోజకవర్గం నుండి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, హుస్నాబాద్ నియోజకవర్గం నుండి పొన్నం ప్రభాకర్‌ల పేర్లు ఖరారయ్యాయి. అదేవిధంగా మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం నుండి ఆవుల మిగతా 2లో..

## కొత్త బిచ్చగాళ్లు వస్తున్నారు...

# జాగ్రత్త

-కొలువులు లేకపోయినా క్వాటర్ సీసాలు దొరుకుతాయి


-మోసపోయి గోసపడకండి

-బీజేపీతోనే అభివృద్ధికి అందలం

-దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

2 లో




# ప్రచారానికి కీలక అస్త్రం సోషల్ మీడియా

- బహిరంగంగా కంటే సోషల్ మీడియా ప్రచారంపైనే పార్టీల దృష్టి
- గెలుపులో కీలక పాత్ర పోషిస్తున్న సోషల్ మీడియా
- సోషల్ మీడియా టీమ్‌ల ద్వారా పార్టీల ప్రచారం

సిద్దిపేట రూరల్, అక్టోబర్ 27, మనం న్యూస్ః రోజురోజుకు సోషల్ మీడియా వినియోగం పెరగడంతో రాజకీయ నాయకులు నేరుగా సంబంధిత గ్రూపులు, ఛానెళ్ల ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు అందజేస్తున్నారు. దీనికై ప్రతి పార్టీ ప్రత్యేకంగా సోషల్ మీడియా విభాగాన్నే ఏర్పాటు చేసుకుంది. గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రత్యేకంగా ఇంచార్జ్‌లను నియమించి పార్టీల వివరాలను ఎప్పటికప్పుడు కార్యకర్తలకు చేరేలా చూస్తున్నారు. గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో సోషల్ మీడియా ముఖ్య భూమిక పోషించనుంది. తెల్లారేసరికి ఫోన్‌లో ఫోటోలు వీడియోల ద్వారా ప్రచారాన్ని మొదలు పెడుతున్నారు. మారుమూల గ్రామాలలో సైతం నెట్‌వర్క్ పెరగడంతో ప్రతి పల్లెపల్లెకు క్షేత్ర స్థాయిలో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఒకప్పుడు ఎన్నికలంటే భారీ బహిరంగ సభలు, ర్యాలీలు, ఫ్లెక్సీలు, కరపత్రాలు, పోస్టర్లతో నాయకులు, కార్యకర్తలు హడావిడి చేసేవారు. ప్రతి ఇంటింటికి తిరుగుతూ తమకు ఓటు వేయాలని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించేవారు. కానీ ఈసారి ఎన్నికలు దానికి విభిన్నంగా వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌లాంటి సామాజిక మాధ్యమాల ద్వారా నేతలు ఎన్నికల ప్రచారాన్ని క్షేత్ర స్థాయిలో తీసుకువెళ్తున్నారు. దీనికై ప్రత్యేక టీమ్‌లను ఏజెన్సీలకు అప్పజెప్పి ప్రచారాన్ని ముమ్మరం మిగతా 2లో..

### ప్రచారానికి కీలక అస్త్రం

# సోషల్ మీడియా

మొదటి పేజీ తరువాయి..

చేశారు గతంలో లేని అభివృద్ధి ఈ పదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి అంటూ పోల్చుతూ ఇటు అధికారంలోని పార్టీ, ప్రతిపక్షంలోని పార్టీలు వీడియోల ద్వారా ప్రజలకు సమాచారాన్ని చేరవేస్తున్నారు. అనుభవజ్ఞులైన టీమ్‌లకు ప్రచారాన్ని సోషల్ మీడియా ద్వారా పంపించే బాధ్యతను అప్పజెప్తూ క్షేత్ర స్థాయిలోకి ప్రచారం తీసుకువెళ్తున్నారు. వినూత్నమైన వీడియోలు, మీమ్స్‌తో ప్రచారాన్ని ప్రజలకు చేరవేస్తున్నారు. రాజకీయ నాయకులపై ట్రోలింగ్ వీడియోలు చేస్తూ ప్రజల్లోకి తీసుకువెళ్తున్నారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాలలో సర్వేల పేరిట ఇంటింటికి తిరుగుతూ ఆయా కంపెనీలు సర్వే చేసి వాటిని గుప్పిట్లో ఉంచుకొని గెలుపు ఎవరిది అనే ప్రచారాస్త్రంగా ఆయా కంపెనీలు ముందుకు సాగుతున్నాయి. గతంలో ఒకరిద్దరు నాయకులు సోషల్ మీడియా ద్వారా ప్రచారాన్ని చేస్తే ఈసారి ఎన్నికల్లో ప్రతి నాయకుడు సోషల్ మీడియానే ఆధారంగా ఎంచుకున్నారు. దీనికై లక్షలు వెచ్చించి కంపెనీలకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. ప్రచార షెడ్యూల్ మొదలు కొని ప్రచారాల వివరాలు, ప్రచారంలోని హైలైట్స్‌ను రీల్స్ రూపంలో ప్రజలకు చేరవేస్తున్నారు. ప్రచారంలో జరిగిన హైలైట్స్‌ను ఎప్పటికప్పుడు రీల్స్‌గా మార్చి సామాజిక మాధ్యమాల ద్వారా పంపించడంతో ప్రజల్లోకి అర్థమయ్యే రీతిలో వీడియోలు అందుతున్నాయి. సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉండడంతో ఢిల్లీ నుండి గల్లీ దాకా జరిగిన సమాచారం సెకన్లలో ప్రజలకు చేరు తుంది. ఈసారి ఎన్నికల్లో యువత ప్రభావం ఎక్కువగా ఉండడంతో ప్రతి నాయకుడు సోషల్ మీడియానే వేదికగా ఎంచుకున్నారు. ప్రత్యేకమైన గ్రూపులను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో వివరాలను సేకరించడంతోపాటు ప్రతి సందేశాన్ని గ్రూపుల ద్వారా పంపిస్తున్నారు.

## తప్పుడు పోస్టులు పెడితే చట్టరీత్యా చర్యలు తప్పవు

### -సిద్దిపేట పోలీస్ కమీషనర్ శ్వేత



ఎన్నికలు సమీపిస్తున్న వేళ సోషల్ మీడియాలో విద్వేషపూరిత, తప్పుడు పోస్టులు పెడితే సదరు వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీస్ కమీషనర్ శ్వేత హెచ్చరించారు. యువత భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని నడుచుకోవాలని, సోషల్ మీడియాలో అనవసరమైన పోస్టులు పెట్టి ఇతరులను ఇబ్బంది పెట్టవద్దని, వారు ఇబ్బంది పడవద్దని భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకకరమైన చిత్రాలు, వీడియోలు, పోస్ట్ చేయవద్దని, వ్యక్తిగత దూషణకు దిగడం, వార్నింగ్ ఇవ్వడం, అంతర్గత వివరాల గురించి అనవసర పోస్టులు, కామెంట్‌లు చేయరాదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యహరించడం జరుగుతుందన్నారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసేటప్పుడు జాగ్రత్తతో అప్రమత్తంగా వ్యవహరించాలని, లేదంటే పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. విద్వేషకర పోస్టులు చేసినా, షేర్ చేసినా వారి సమాచారాన్ని సిద్దిపేట పోలీస్ కమీషనర్ కంట్రోల్ రూమ్ వాట్సప్ నెంబర్ 87126 67100కు తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు

## కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారు

మొదటి పేజీ తరువాయి..

రాజిరెడ్డి పేర్లను ఖరారు చేస్తూ ఏఐసిసి రెండో జాబితాను విడుదల చేసింది. దీనితో ఉమ్మడి జిల్లాలోని పటాన్‌చెరు మినహా అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసిందనే చెప్పవచ్చు. పటాన్‌చెరు నియోజకవర్గం నుండి టికెట్ ఎవరికి లభిస్తుందోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఇప్పటికే టికెట్ ఆశిస్తున్న కాటా శ్రీనివాస్ గౌడ్, గాలి అనిల్‌కుమార్‌లు ఉండగా నీలం మధు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో టికెట్ ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠ వ్యక్తమవుతోంది. ఏది ఏమైనా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఖరారు చేయడంతో రేపటి నుంచి వారంతా ఫీల్డ్‌లో బిజీ బిజీగా ఉండనున్నారు.

# కొత్త బిచ్చగాళ్లు వస్తున్నారు... జాగ్రత్త

దౌల్తాబాద్, అక్టోబర్ 27, మనం న్యూస్‌: రాబోయే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని దుబ్బాక ఎమ్మెల్యే, బీజేపి దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి రఘునందన్‌రావు ఓటర్లను కోరారు. శుక్రవారం రోజున దౌల్తాబాద్ మండలంలోని గొడుగుపల్లి, లింగాయిపల్లి తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘునందన్ రావుకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండేళ్ల సమయంలోనే దుబ్బాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మరోసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ఓటర్లను కోరారు. ఒక తండాలో పుట్టి పెరిగిన మహిళను దేశ రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపికే దక్కిందని, మన పిల్లలకు కూడా కొలువులు రావాలంటే బీజేపి కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కరోనా సమయంలో పేద ప్రజలకు ఉచితంగా రేషన్ బియ్యం ఇవ్వడం జరిగిందన్నారు. లింగాయపల్లి తండాలో సేవాలాల్ మహరాజ్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తండా మహిళలు గ్రామంలో సంపూర్ణ మద్య నిషేధం చేసి దుబ్బాక ప్రజలు ఆదర్శంగా నిలిచారని అభినందించారు. ప్రతి గ్రామానికి డబుల్ బెడ్‌రూమ్ రావాలంటే పువ్వు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని, దుబ్బాక





నియోజకవర్గంలో ఎన్నికలు రాగానే కొత్త బిచ్చగాళ్లు వచ్చినట్టు వచ్చి ప్రచారాలు చేసి ప్రజలను మభ్యపెట్టి ఓట్లు లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తామని ఇంత వరకు రుణమాఫీ జాడలేకుండా పోయిందని మండిపడ్డారు. బిసిబంధు, దళితబంధు ఇస్తానని చెప్పి ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పుడు కేసీఆర్ ప్రభుత్వం కొలువులు లేవు కానీ గ్రామాల్లో మద్యం మాత్రం ఏరులై పారిస్తుందన్నారు. ఉదయం కిరాణ కొట్టులో పేస్ట్ మాత్రం దొరకదు కానీ క్వాటర్ సీసా మాత్రం దొరుకుతుందని ఆయన మండిపడ్డారు. అనంతరం దీపాయంపల్లిలో నూతనంగా ప్రతిష్టిస్తున్న పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కిషన్, ఉపాధ్యక్షులు గడ్డమీది స్వామి, బొల్లం స్వామి, సర్పంచ్‌లు దేవి యాదగిరి, సురేందర్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, రామస్వామి గౌడ్, కుమ్మరి నర్సింలు, ప్రసాద్‌రావు, రంజిత్, నరసింహారెడ్డి, ముత్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

### -కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్

### -గజ్వేల్ ఏసిపి రమేష్



గజ్వేల్, అక్టోబర్ 27, మనం న్యూస్‌: ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగం ప్రతి పౌరుడికి అందించిన ఓటు హక్కును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ ఏసిపి రమేష్ అన్నారు. సిద్దిపేట సిపి శ్వేత ఆదేశానుసారం శుక్రవారం మండల పరిధిలోని జాలిగామ గ్రామంలో కేంద్ర బలగాల అధికారులు, సిఐ జాన్‌రెడ్డి, అదనపు సిఐ రంగకృష్ణ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి కేంద్ర బలగాల ద్వారా భౌగోళిక పరిస్థితులపై అవగాహన కల్పించడానికి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో ప్రతి ఓటరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవరైనా ప్రలోభాలకు గురి చేసినట్లయితే అట్టి వాటిని స్వీకరించరాదని, ఓటరు స్వతంత్రంగా తమకు నచ్చిన వ్యక్తిని ఎన్నుకునే హక్కు ఓటరుకు ఉందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. ఎవరైనా ప్రత్యేకంగా ఓటు వేయమని ఇబ్బందులకు గురి చేసినట్లయితే వెంటనే సివిజిల్ యాప్ ద్వారా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లయితే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా నేరపూరిత చర్యలకు పాల్పడినా, అల్లర్లు, గొడవలు సృష్టించినా ఈ యాప్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు.

# పల్లాకు నిరసన సెగ

సిద్దిపేట, అక్టోబర్ 27, మనం న్యూస్ ప్రతినిధి: జనగామ బిఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి నిరసన సెగలు తప్పడం లేదు. ఎక్కడికి వెళ్లినా సమస్యలతో చుట్టుముడుతూ పరిష్కారానికి మార్గమేదంటూ నిలదీస్తున్నారు. పట్టుపట్టిమరీ జనగామ టిక్కెట్ దక్కించుకున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డికి అడుగడుగునా నిరసన సెగలే వస్తుండడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. టిక్కెట్ ప్రకటించిన తొలిరోజే చేర్యాలకు వచ్చిన పల్లా రాజేశ్వర్‌రెడ్డిని చేర్యాల డి విజన్ హామీ ఏమైందంటూ నిలదీయగా ఎలాగోలా తప్పించుకున్నారు. శుక్రవారం రోజున కొమురవెల్లి మండలం తపాస్‌పల్లికి వెళ్లిన పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మరోమారు నిరసన సెగ తప్పలేదు. పదేళ్లలో కేసీఆర్ పాలనలో తపాస్‌పల్లి అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిందంటూ బాహాటంగానే నిరసన వ్యక్తం చేశారు. ప్రచారానికి వచ్చిన పల్లాను గ్రామ పొలిమేరల్లోనే అడ్డుకొని గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో అంటూ ఫ్లెక్సీలు కట్టిమరీ నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తలాపున పారుతుంది గోదారి.. మన చేలు మన చెలుక ఎడారి అంటూ పాడుకున్న రోజులు ప్రస్తుతం గ్రామాల్లో కనిపిస్తున్నాయన్నారు. తలాపునే తపాస్‌పల్లి ఉన్నా సాగునీరుకు మాత్రం నోచుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా కొనసాగుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు భృతి ఇస్తామన్న హామీని ఎందుకు అమలు చేయలేదో చెప్పాలంటూ నిలదీశారు. ఒక పక్క అభివృద్ధిలో దూసుకుపోతున్నామంటూ ప్రగల్బాలు చెప్తూనే మరో వైపు కనీస రవాణా సౌకర్యం లేక తపాస్‌పల్లి గోసపడుతుందంటూ వాపోయారు. టీఆర్ఎస్‌కు అండగా ఉండకుంటే మంచిగ ఉండదంటూ స్థానిక బిఆర్ఎస్ నేతలు బెదిరిస్తున్నారని, ఎవరెన్ని బెదిరింపులకు పాల్పడినా గ్రామంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తేనే తాము ఆహ్వానిస్తామన్నారు. ఏది ఏమైనా తనకున్న పలుకుబడితో టిక్కెట్ అయితే తెచ్చుకోగలిగాడు కానీ అడుగడుగునా వ్యక్తమవుతున్న నిరసన నుండి పల్లా ఎలా బయట పడుతాడో వేచి చూడాలి మరి.

## గద్దర్‌కు 45 పాటల బహుజన స్వరార్పణ నివాళి





గజ్వేల్, అక్టోబర్ 27, మనం న్యూస్‌: విశ్వజన కళామండలి 45 సంవత్సరాల వార్షికోత్సవం సందర్భంగా గద్దర్‌కు నివాళిగా 45 పాటల బహుజన స్వరార్పణ చేయడం జరుగుతుందని, మంగళవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని విశ్వజన కళామండలి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మాచవరం బాలనర్సయ్య అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో కార్యక్రమం ఉంటుందని, ఈ మేరకు శుక్రవారం గజ్వేల్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రం విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ నాయకులు తుమ్మ శ్రీనివాస్, డిబిఎఫ్ నాయకులు దాసరి ఏగొండ స్వామి, అంబేద్కర్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డా. చిప్పల యాదగిరి, గంగోల మల్లేశం, కిషన్ స్వామి తదితరులు ఉన్నారు.

# దీవించండి... సేవచేస్తా



ఒక్క అవకాశం ఇవ్వండి... మీ కష్టాల్లో తోడుంటా

గెలిపించే బాధ్యత మీది... అభివృద్ధి చేసే బాధ్యత నాది

నియోజకవర్గ ప్రజల శ్రేయస్సే ధ్యేయం

పల్లాకు బ్రహ్మరథం పట్టిన ప్రజలు, పార్టీ శ్రేణులు





కొమురవెల్లి, అక్టోబర్ 27, మనం న్యూస్‌: కొమురవెల్లి మండల ప్రజలు ఆశీర్వదిస్తే ఐదేండ్లు సేవకుడిగా పని చేస్తానని, ఒక్క అవకాశం ఇవ్వండి.. మీ కష్టాల్లో తోడుంటానని, గెలిపించే బాధ్యత మీది... అభివృద్ధి చేసే బాధ్యత నాది... ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా నిరంతరం పని చేస్తానని ఎమ్మెల్సీ, జనగామ బిఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని రసూలాబాద్, ఐనాపూర్, తపాస్‌పల్లి, గురువన్నపేట గ్రామాల్లో పర్యటన చేపట్టారు. బిఆర్ఎస్ అభ్యర్థి పల్లాకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గ్రామాల్లో ప్రచారం నిర్వహించిన పల్లాకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. పల్లా ప్రతి ఒక్కరిని పేరుపేరున ఆప్యాయంగా పలకరించారు. ఇంటింటికి తిరుగుతూ ఆయన ప్రచారం చేశారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న, అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు. ప్రజలు ఏది కోరుకుంటే అది చేస్తానన్నారు. ప్రజల అండదండలు, ప్రోత్సాహంతోనే జనగామ నియోజకవర్గానికి పని చేసే అదృష్టం కేసీఆర్ ఇచ్చారని పేర్కొన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల కోసం శ్రమిస్తానన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల ద్వారా పని చేసే అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలు అభిమానులు జై కేసీఆర్, జై పల్లా అంటూ నినాదాలు చేశారు.

### –మేనిఫెస్టో చూసి ప్రతిపక్షాలకు దిమ్మ తిరుగుతుంది

రైతుబంధు, రైతుబీమా, మిషన్ కాకతీయ, మిషన భగీరథ వంటి ఎన్నో పథకాలతో రాష్ట్రాన్ని నెంబర్ వన్ స్థానంలో నిలిపారన్నారు. బిఆర్ఎస్ మేనిఫెస్టోను చూసి ప్రతిపక్షాలకు దిమ్మ తిరుగుతుందని, ఏం చేయాలో పాలుపోక ఇష్టం వచ్చినట్లు విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా అన్నారు. కాంగ్రెస్ అధికారమిస్తే వ్యవసాయానికి 3 గంటలే కరెంటు దిక్కవుతుందని, గత్వంలో రైతులకు మాత్రమే రూ.5 లక్షల బీమా కల్పించగా ఇప్పుడు రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి కేసీఆర్ ప్రతి ఇంటికి బీమాతో ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న కేసీఆర్ కావాలా... పూటకో సీఎం మారే కాంగ్రెస్ కావాలో ప్రజలే ఆలోచించుకోవాలన్నారు.

### –నన్ను ఆదరించండి.. అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యేగా తనకు అవకాశం కల్పించాలని, అభివృద్ధి చేసి చూపిస్తాను.. ఓటర్లే తన దేవుళ్లని, తాను పూజారిగా సేవలు చేసుకుంటాన్నానరు. ఒక పక్క ప్రజా సంక్షేమం, మరో పక్క అభివృద్ధి రెండు కళ్లలా భావించి ముందుకు సాగుతానని పల్లా రాజేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టో అద్భుతమన్నారు. మూడవసారి అధికారంలోకి రాగానే రాష్ట్రంలో 90 లక్షల మందికి కుటుంబానికి రూ.5 లక్షల బీమా, సౌభాగ్య లక్ష్మి పథకం ద్వారా నిరుపేద మహిళలకు నెలకు రూ.3 వేలు పింఛన్, రూ. 400లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు అమలు చేస్తామన్నారు. కావున ప్రజలందరూ కారు గుర్తుకు ఓటేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రసూలాబాద్ సర్పంచ్ స్వామి గౌడ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, ఐనాపూర్ గ్రామస్తులు మెరుగు కృష్ణ గౌడ్, వైస్ ఎంపిపి కయిత రాజేందర్‌రెడ్డి, తపాస్‌పల్లి గ్రామస్తులు, గురువన్నపేట గ్రామస్తులు బుడిగె గురవయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో 200 నామినేషన్‌లు వేస్తాం

## అమరవీరుల కుటుంబాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రఘురామారెడ్డి

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 27, మనం న్యూస్‌: తెలంగాణ అమరవీరుల కుటుంబాల రాష్ట్ర ఐక్యవేదిక తెలంగాణ ఉద్యమకారులకు ఐక్యవేదిక తెలంగాణ దళిత సంఘాల జేఏసితో కలిసి వచ్చే ప్రజా సంఘాలతో కలిసి సిద్దిపేట నియోజకవర్గంలో రెండు వందల నామినేషన్‌లు వేసి హరీష్‌రావుకు బుద్ధి చెప్తామని అమరవీరుల కుటుంబాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రఘురామారెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పోరాటాలకు బదులుగా కపట నాటకం ఆడి పెట్రోల్ పోసుకున్న వ్యక్తికి అగ్గిపెట్టె దొరకలేదా అని ప్రశ్నించారు. 1386 మంది తెలంగాణ అమరవీరుల చావులకు కారణం హరీష్‌రావేనని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారులకు నేనున్నా అని ఉద్యమాలు చేయించి, నేడు ఆ ఉద్యమకారుల త్యాగాలను గుర్తించడానికి కూడా సమయం లేదా అని మండిపడ్డారు. కల్వకుంట్ల కుటుంబానికి బుద్ధి చెప్పడానికి తెలంగాణను రక్షించుకోవడానికి తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమకారులు, తెలంగాణ దళిత బిడ్డలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోయే




ఎన్నికల్లో నిజమైన తెలంగాణ అమరవీరులకు, 1386 మంది చావులకు కారణమైన హరీష్‌రావుకు మధ్య జరుగుతున్న పోటీయే ఈ ఎన్నిక అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అమరవీరుల కుటుంబ సభ్యులు మమత, సునీత, లక్ష్మమ్మ, ప్రేమలత, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.



# వడ్ల కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి

## తహసీల్దార్‌కు నాయకుల వినతి

చేర్యాల, అక్టోబర్ 27, మనం న్యూస్‌: వడ్ల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చేర్యాల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జోగినిపల్లి రాజేశ్వర్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ హాజరై మాట్లాడారు. రైతులు వరి చేడసి వడ్లను ఐకేపి, పిఎసిఎస్ వ్యవసాయ మార్కెట్ యార్డు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి పది రోజులు గడుస్తున్నా నేటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్, బార్దాన్, జల్లెడ మిషన లారీల వంటి కొరత లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కత్తుల భాస్కర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఈరి భూమయ్య, సిద్ధిరాం భద్రయ్య, ఏషబోయిన కవిత, మహదేవులు, ఎల్లయ్య, లచ్చవ్వ, రజిత, మల్లేశం, సురేందర్, కనకయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.




# నేడు కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

## మండల పార్టీ అధ్యక్షులు పడాల రాములు

దౌల్తాబాద్, అక్టోబర్ 27, మనం న్యూస్‌: నేడు దౌల్తాబాద్ మండల కేంద్రంలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో దౌల్తాబాద్, రాయపోల్, నార్సింగి, చేగుంట మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పడాల రాములు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారన్నారు. కావున ఉదయం 10 గంటల వరకు మండల నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇంచార్జ్‌లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జిల్లా నాయకులు గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్ కమిటీ అధ్యక్షులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు, బిసి సెల్ అధ్యక్షులతోపాటు అన్ని విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్, భద్రయ్య, ఎస్ఎస్ఎల్ అధ్యక్షులు బండర్‌లాలుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వం

## జెడ్పీటిసి తడిసిన ఉమా వెంకట్‌రెడ్డి

నంగునూరు, అక్టోబర్ 27, మనం న్యూస్ః ముచ్చటగా మూడోసారి బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని జెడ్పీటిసి తడిసిన ఉమా వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బద్దిపడిగ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. రైతుల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వం బిఆర్ఎస్ అన్నారు. బిఆర్ఎస్ రైతుల కోసం పాటుపడుతుంటే కాంగ్రెస్ పార్టీ వాటిని రైతులకు అందకుండా ఆపాలని చూస్తుందన్నారు. ఆరు నూరైనా రాబోయేది తెరాస ప్రభుత్వమే అన్నారు. ఐదు దశాబ్దాలకు పైగా పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం ఏం చేసిందో చెప్పాలన్నారు. తెరాస ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఎలాంటి పైరవీలు లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ లబ్ధిదారులకు అందిస్తుందన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌ను అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి మూడు గంటల కరెంటు మాత్రమే అవసరమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికలు వచ్చినపుడు బీజేపి, కాంగ్రెస్ నాయకులు ప్రజల్లో తిరుగుతారని, ఎన్నికల తర్వాత బీజేపి, కాంగ్రెస్ నాయకులు పత్తా లేకుండా పోతారన్నారు. జరగబోయేఎన్నికల్లో మంత్రి హరీష్‌రావు లక్షా యాభై వేళ



మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్ పామ్ రైతు వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షులు సోమిరెడ్డి, ఏఎంసి ఛైర్మన్ రావుల సారయ్య, తెరాస మండల పార్టీ అధ్యక్షులు అనగాని లింగం గౌడ్, సీనియర్ నాయకులు దువ్వల మల్లయ్య, రామచంద్రారెడ్డి, సంగు పురేందర్, వేముల వెంకట్‌రెడ్డి, పిఎపిఎస్ ఛైర్మన్ మహిపాల్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి సిరికొండ మణిలతోపాటు తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ పార్టీకి మండల కో ఆప్షన్ సభ్యులు రాజీనామా

పాపన్నపేట, అక్టోబర్ 27, మనం న్యూస్ః పాపన్నపేట బిఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. పాపన్నపేట మండల కో ఆప్షన్ సభ్యులు మహ్మద్ గౌస్ పాషా మండల కేంద్రంలోని దుర్గమ్మ గైని వద్ద శుక్రవారం రాజీనామా ప్రకటించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2008 నుండి బిఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న తనకు ప్రభుత్వం నుండి కానీ, ఎమ్మెల్యే నుండి గానీ ఎలాంటి సహకారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనను నమ్ముకున్న తోటి మైనార్టీ సోదరులకు తానేమీ చేయలేకపోయానని, అందుకే బిఆర్ఎస్ పార్టీని వీడుతున్నానన్నారు. కాగా ఏ పార్టీలో చేరుతారన్నది వెల్లడించలేదు. ఆయనతోపాటు బిఆర్ఎస్ సీనియర్‌నాయకులు పోతేదార్, ఉమామహేశ్వర్, ఖుర్షీద్, మన్సూర్, హఫీజ్, అఫ్జల్, తాజ్, నగేష్‌లు రాజీనామా చేశారు.

# హలో మాదిగ ఛలో ఇందిరా పార్కు కరపత్రం ఆవిష్కరణ



తొగుట, అక్టోబర్ 27, మనం న్యూస్ః తొగుట మండల కేంద్రంలో హలో మాదిగ ఛలో ఇందిరా పార్కు మాదిగల యుద్ధభేరి నవంబర్ 5న జరిగే సభ కరపత్రం ఆవిష్కరణ శుక్రవారం తొగుటలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయపరమైన వాటాకై రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు మాదిగ డిక్లరేషన్ ప్రకటించాలని, రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో అన్ని పార్టీలు మాదిగలకు 23 సీట్లు కేటాయించాలని, ఎస్సీ వర్గీకరణ కోసం కేసీఆర్ చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలన్నారు. అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, తక్షణమే డప్పు చెప్పు వృత్తిదారులకు రూ.4 వేల పెన్షన్ ప్రకటించాలన్నారు. పదేళ్లో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు అందించాలని, రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరారు.

తెలంగాణ ప్రభుత్వ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపక ఇతర ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. హైదరాబాద్ జిల్లాకు భాగమతి జిల్లాగా నామకరణం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ టిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు, దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ సిద్ధిని రాజమల్లయ్య మాదిగ, జిల్లా గౌరవ అధ్యక్షులు బొంబాయి వెంకన్న, సిద్దిపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాల కృష్ణ, తొగుట మండల అధ్యక్షులు లింగాల మహేష్ మాదిగ, సీనియర్ నాయకులు లింగాల స్వామి, కాసర్ల నర్సింలు, చందాపూర్ బాల్‌నర్సు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు చక్రధర్‌గౌడ్ చేయూత

### తన ప్రతినిధులతో బియ్యం ఆర్థిక సాయం

### తామున్నామంటూ భరోసా



సిద్దిపేట, అక్టోబర్ 27, మనం న్యూస్ ప్రతినిధిః బాధిత కుటుంబాలకు సిద్దిపేట జిల్లా బీజేపి నాయకులు చక్రధర్ గౌడ్ బాసటగా నిలిచారు. గత కొంత కాలంగా సేవా కార్యక్రమాల్లో ముందుంటూ పలువురి మన్ననలు పొందిన చక్రధర్ గౌడ్ మరోసారి తన సేవా గుణాన్ని చాటుకున్నారు. సిద్దిపేట నియోజకవర్గం నారాయణరావుపేట మండలంలోని జక్కాపూర్ గ్రామంలో మరణించిన నిరుపేద కోల సులోచన కుటుంబానికి చక్రధర్ గౌడ్ అండగా నిలిచారు. రోడ్డు ప్రమాదంలో కోల సులోచన మృతిచెందిందన్న విషయం తన ప్రతినిధుల ద్వారా తెలుసుకొని క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు. అదేవిధంగా నంగునూరు మండలం రాజ్‌గోపాల్‌పేటకు చెందిన మొగిలి మల్లేశం పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని గ్రామస్తులు చక్రధర్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్లగా తక్షణ సాయం కింద రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చక్రధర్‌గౌడ్ సేన ప్రతినిధులు మాట్లాడుతూ ఆపదలో అండగా ఉంటామని, చక్రధర్ గౌడ్ ద్వారా మరింత మందికి అండగా ఉండేందుకు ప్రయత్నం చేస్తామన్నారు.



# బిఆర్ఎస్‌ది ఆడలేక మద్దెల తప్పులా ఉంది

## మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి

బెజ్జంకి, అక్టోబర్ 27, మనం న్యూస్ః బిఆర్ఎస్ ప్రభుత్వానికి పథకాలను అమలు చేసే పరిస్థితి లేక కాంగ్రెస్‌పై విమర్శలు కురిపిస్తుందని, బిఆర్ఎస్ ఆడలేక మద్దెల తప్పులా వ్యవహరిస్తుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రోజున ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొనసాగింపు పథకాలైన రైతుబంధు, రుణమాఫీ, పింఛన్లు, దళితబంధు, గృహలక్ష్మి, బిసి సహాయం వంటి అన్ని నవంబర్ 2వ తేదీ లోపు ప్రజలకు ఇవ్వాలని కాంగ్రెస్ ఫిర్యాదులో పేర్కొందన్నారు. కేవలం ప్రోసీడింగ్‌లు చూపి ప్రజలను మభ్యపెట్టడం సరికాదన్నారు. దమ్ముంటే నవంబర్ 2లోపు ఇచ్చినట్లయితే మీరు మోసం చేయలేదని ఒప్పుకుంటామని, లేనిపక్షంలో మోసగాళ్లుగా గుర్తించడం జరుగుతుందన్నారు. ఎన్నికల కోడ్‌ను యథేచ్ఛగా ఉల్లంఘిస్తుంటే ఈసి, ప్రభుత్వ యంత్రాంగం చూసీ చూడనట్లు ఉండడం శోచనీయమన్నారు. ఖజానా ఖాళీ చేసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి సంక్షేమాన్ని సాగదీస్తూ ఇవ్వడానికి చేతకాక మీ తప్పును కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ పార్టీపై బురదజల్లుతున్నారన్నారు. సంక్షేమానికి మారుపేరు కాంగ్రెస్ పార్టీ అని, ఏ పథకమైనా అందరికీ సమానంగా ఇచ్చింది కానీ బిఆర్ఎస్ మాదిరిగా బంధువులకు, కమీషన్‌ల కోసం ఆశపడలేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జనగాం శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ




దుబ్బాక, అక్టోబర్ 27, మనం న్యూస్ః లయన్స్ క్లబ్ సిద్దిపేట రీజియనల్ ఛైర్మన్ వినోద్ మోదాని కూతురు స్మెర మోదాని జన్మదినం సందర్భంగా శుక్రవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట వార్డులోని జెడ్పి ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులు 41 మందికి పరీక్ష అట్టలను అందంచారు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ శ్రీనివాస్ మాట్లాడుతూ మోదాని కూతురు స్మెర జన్మదినం సందర్భంగా విద్యార్థులకు ప్యాడ్‌లు పంపిణీ చేయడం హర్షనీయమన్నారు. లయన్స్ క్లబ్ మెంబర్ చీకోటి చంద్రశేఖర్, పాఠశాల జూనియర్ అసిస్టెంట్ ప్రోత్సాహంతో విద్యార్థులకు అట్టలు అందించడం జరిగిందన్నారు.

## జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి



జగదేవ్‌పూర్, అక్టోబర్ 27, మనం న్యూస్ః ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి 67వ వాలీబాల్ (బాలుర) అండర్ 17 విభాగం క్రీడలు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మోడల్ స్కూల్ పదవ తరగతి విద్యార్థి సృజన్ జమ్మూకాశ్మీర్ రాష్ట్రం శ్రీనగర్‌లో ఈనెల 30వ తేదీ నుండి జరిగే జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు ప్రిన్సిపల్ స్లీవరాజ్ హర్షం వ్యక్తం చేస్తూ సృజన్‌ను అభినందించారు. సృజన్‌కు ఉత్తమ శిక్షణ అందించిన పిడి అనంతరాములు చారిని ప్రిన్సిపల్, అధ్యాపక బృందం అభినందించారు. సృజన్ జాతీయ స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబర్చాలని వారు ఆకాంక్షించారు.

# కర్షక వ్యతిరేకి కాంగ్రెస్

**రైతు బంధు ఆపాలని ఈసీకి ఫిర్యాదు చేస్తరా..?**

**రైతులంటేనే ఓర్వడం లేదు**

**సీఎం కేసీఆరే రైతు బాంధవుడు**

**హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత**



హుస్నాబాద్,అక్టోబర్ 27,(మనం న్యూస్)ః అది చేస్తాం..ఇది చేస్తాం అని కాంగ్రెస్ దొంగ హామీలు ఇస్తోంది..వాళ్లు ఏదీ చేయరు ఉన్నవి తొలగిస్తరు. కాంగ్రెస్ అంటేనే కర్షక వ్యతిరేకి. రైతన్నకు పంట పెట్టుబడికి ఇచ్చే రైతు బంధు ఆపాలని ఈసీకి ఫిర్యాదు చేస్తరా..? ఇదేం వైఖరి..రైతులంటే మరీ ఇంత ఓర్వలేని తనమా..? అంటూ హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత ఆగ్రహం వ్యక్తం చేసారు. పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ బీ ఆర్ఎస్ పాలనలో వ్యవసాయం పండుగలా మారితే కాంగ్రెస్ నాయకులు చూసి ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. పంట పెట్టుబడి సాయంతో వడ్డీ వ్యాపారుల వైపు చూడకుండా రైతు సగర్వంగా వ్యవసాయం చేసుకుంటుంటే జీర్ణించుకోలేకపోతున్నారని, ఇది ఎంత వరకు కరెక్టో చెప్పాలన్నారు. రైతులు, దళితులు, మైనార్టీల ఓట్లతో 60 ఏండ్లు అధికారాన్ని అనుభవించిన కాంగ్రెస్, నేడు రైతు వ్యతిరేక విధానాలు అవలంభించడం సరికాదన్నారు. ఏకంగా రైతుబంధునే ఆపాలని మరో నాయకుడు ఈసీకీ ఫిర్యాదు చేయడాన్ని చూస్తే రైతుల పై వారికి ఎంత ప్రేమ ఉందో అర్థమైపోతున్నదన్నారు. ఉచిత విద్యుత్ సరఫరాకు వాళ్లే బ్రాండ్ అంబాసిడర్‌లమని చెప్పుకునే కాంగ్రెస్, మరి కర్ణాటకలో అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా సాగుకు ఐదు గంటల కరెంటు కూడా ఇవ్వలేక చేతులెత్తిసిందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా రైతులు గమనించాలని, రైతు బాంధవుడు కేసీఆర్ కావాలా..? ఉన్నయి తీసేసి ఇబ్బందులు పెట్టే కాంగ్రెస్ కావాలా ఆలోచించుకోవాలని పిలుపునిచ్చారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ సీఎం అయిన తర్వాతనే వ్యవసాయం పండుగలా మారిందన్నారు. సాగుకు 24 గంటల కరెంట్ ఇస్తున్నామని, రైతుబంధు, రైతు బీమాతో ఎంతో భరోసా నింపామన్నారు. కాంగ్రెస్, బీజేపీలు అధికారంలోకి వస్తే అంధకారమేనని, వారి పాలిత రాష్ట్రాల్లో రైతుబంధు, దళితబంధు కాదు కదా..? మన మాదిరి ఏ ఒక్క పథకం కూడా అమలు చేయడంలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రాంరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజిని, కౌన్సిలర్ హరీశ్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, నాయకులు చిట్యాల గోపాల్‌రెడ్డి, ముప్పిడి రాజిరెడ్డి, రవి, వాల నవీన్, తదితరులున్నారు.




## నేడు ఏడుపాయల ఆలయం మూసివేత

పాపన్నపేట, అక్టోబర్ 27, మనం న్యూస్ః తెలంగాణలో ప్రసి ద్ధిగాంచిన ఏడుపాయల శ్రీ వనదుర్గామాత దేవస్థానం శనివారం రోజున చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం 3 గంటలకు ఆల యం మూసివేయబడుతుందని దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ సా తెల్లి బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డిలు ఒక ప్రకటనలో వెల్లించారు.

తిరిగి ఆదివారం ఆలయ సంప్రోక్షణ, అమ్మవారి అభిషేకం అనంతరం ఉదయం 8 గంటలకు భక్తులకు దర్శనం కల్పిస్తున్నట్లు వారు వెల్లడిం చారు. భక్తులు సహకరించాలని వారు కోరారు.

# హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా పొన్నం

**కార్యకర్తల సంబురాలు**

**ఎల్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు**



హుస్నాబాద్,అక్టోబర్ 27,(మనం న్యూస్)ః తెలంగాణ కాంగ్రెస్ అభ్యర్థుల రెండవ జాబితాను శుక్రవారం రాత్రి 45 మంది అభ్యర్థులతో విడుదల చేసింది. అందులో హుస్నాబాద్ నుండి దరఖాస్తు చేసుకున్న కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించింది. హుస్నాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం కొన్ని రోజుల నుండి ఉత్కంఠ కొనసాగింది. టికెట్ కోసం మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డిలు పోటీ పడగా అధిష్టానం పొన్నం ప్రభాకర్ బీసీ సామాజిక వర్గానికి చెందినవాడు కావడంతో ఆయనకే మొగ్గు చూపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గ ఓట్లు అత్యధికంగా ఉండటంతో, పొన్నం ప్రభాకర్ గౌడ్ మాజీ ఎంపీ, రాష్ట్ర నేత కావడంతో అధిష్టానం ఆయననే ప్రకటించారు. హుస్నాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించడంతో ఇక జాతీయ పార్టీ బీజేపీ అభ్యర్థిని ప్రకటిస్తే హుస్నాబాద్ రాజకీయం వేడేక్కనుంది.

### ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు....

హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థుల రెండవ జాబితాను ప్రకటిస్తున్నారన్న సమాచారంతోనే హుస్నాబాద్ ఎల్లమ్మ తల్లి ఆలయానికి మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్ కాంగ్రెస్ నాయకులతో వెళ్లి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసారు. టికెట్ రావాలంటూ అమ్మవారిని ఆయన వేడుకొన్నారు. రాత్రి టికెట్ వచ్చిన విషయం తెలియగానే కాంగ్రెస్ నేతలు పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సందడి నెలకొంది. కార్యకర్తలందరూ పొన్నం ప్రభాకర్‌కు స్వీట్లు తినిపిస్తూ శుభాకాంక్షలు తెలియజేసారు.



# ఓటు వజ్రాయుధం

- ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి
- నచ్చిన వ్యక్తికే ఓటు వేయండి
- బెదిరింపులకెవరైనా పాల్పడితే సమాచారమివ్వాలి
- హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీశ్

హుస్నాబాద్,అక్టోబర్ 27,(మనం న్యూస్)ః ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధమని, నవంబర్ 30 న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీశ్ అన్నారు. అక్కనపేట మండల కేంద్రంలో ఏసిపి వాసాల సతీశ్, సి.ఐ.కిరణ్, సశాస్త్ర సీమ బాల్ కేంద్ర బలగాలతో శుక్రవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి సతీశ్ మాట్లాడుతూ ఓటు హక్కు ద్వారా ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో ఓటు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంటుందన్నారు. ఓటు హక్కును ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా మీకు నచ్చిన వ్యక్తికి ఓటు వేసే ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తామని ఆయన తెలిపారు. ఓటు విషయంలో ఏవరైనా బెదిరింపులకు పాల్పడితే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారమివ్వాలన్నారు. లేదంటే డయల్ 100, కంట్రోల్ రూమ్ 8712667100 ఫోన్ చేసి చెప్పాలన్నారు. మద్యానికి, డబ్బులకు మరే ఇతర వస్తువులకు బానిసలు కావొద్దని, మీకు నచ్చిన మెచ్చిన అభ్యర్థికి నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్భయంగా ఓటు వేసి ఓటు శాతాన్ని పెంచాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిపించడానికి అన్ని రకాల ప్రణాళికలు తయారు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ జరిగే రోజు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు సమకూర్చడం జరుగుతుందన్నారు. గ్రామాలలో ఏ పార్టీ వారు వచ్చి ప్రచారం చేసిన అడ్డుకోవద్దని ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా ప్రచారం చేసుకోవచ్చని మీకు నచ్చిన వ్యక్తికి ఓటు వేయండి కానీ ప్రచారాన్ని అడ్డుకోవద్దని ఆయన హెచ్చరించారు. ఎవరైనా అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పారామిలటరీ దళాలతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, అభ్యర్థులకు సంబంధించిన వ్యక్తులు కానీ ఓటు వెయ్యమని ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన, డబ్బులు ఆశ చూపి ప్రలోభ పెట్టినా, మద్యం డబ్బులు ఓటర్లకు సరఫరా చేసినా ఎలాంటి నేరపూరిత చర్యలకు దిగినా సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అక్కనపేట ఎస్.ఐ.తాండ్ర వివేక్, హుస్నాబాద్ ఎస్.ఐ.తోట మహేశ్, కోహెడ ఎస్.ఐ.తిరుపతి, కేంద్ర బలగాలు ఎస్ఎస్బి అధికారులు, సిబ్బంది, తదితరులున్నారు.






## ఓర్వలేకే మైనార్టీలపై దాడులు

### ఎస్‌డిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఆకునూరి మురళి



గజ్వేల్, అక్టోబర్ 27, మనం న్యూస్ః పేదలకు కుల మతాలకు అతీతంగా సేవ చేస్తున్న సంఘ సేవకురాలు, ఎస్‌డిఎఫ్ సభ్యురాలు మహ్మద్ సుల్తానా ఉమర్‌పై బీజేపి నాయకులు పిచ్చి కూతలు కూయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని నిందితుడు బీజేపి కార్యకర్త కొత్తిండ్ల సత్యంను వెంటనే అరెస్ట్ చేయాలని ఎస్‌డిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఆకునూరి మురళి డిమాండ్ చేశారు. శుక్రవారం సుల్తానా మురళిని కలిసి సంఘటన వివరాలను వివరించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ బీజేపి పార్టీ ఓర్వలేకనే మైనార్టీలపై దాడులు చేస్తుందన్నారు. భారతదేశంలో అన్ని మతాలు, కులాల వారు జీవించే హక్కు ఉందని ముస్లిం, మైనార్టీలు కూడా ఈ దేశ ప్రజలే అని భారతదేశం ప్రజలందరిదన్నారు. ఏ మనిషి కూడా వ్యక్తిగతంగా దూషించడం, కించపరిచే హక్కు ఎవరికీ లేదన్నారు. బీజేపి ముస్లిం మైనార్టీ, దళితులపై దాడులు, అరాచకాలు అనేకం చేస్తుందని, వాటిని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక కార్యకర్తలపై విష ప్రచారం చేస్తుంటే చేస్తూ ఊరుకోబోమని మురళి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం జేఏసి రాష్ట్ర నాయకులు ఖలీదా ఫర్వీన్, రచయిత సైబాబా, డిబిఎఫ్‌జాతీయ కార్యదర్శి శంకర్, రాష్ట్ర కార్యదర్శి కల్పన తదితరులు పాల్గొన్నారు.

## పస్తులుంటున్నాం... పట్టించుకోండి

### ఆవేదన వ్యక్తం చేసిన చేనేతలు

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 27, మనం న్యూస్ః తమను ఆదుకోవాల్సిన ప్రభుత్వ అధికారులు, నాయకులు తమను పట్టించుకోకపోవడంతో సరైన పని దొరకక పస్తులుండాల్సిన పరిస్థితి దాపురించిందని చేనేతలు ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల పట్ల చేనేత అధికారి నిర్లక్ష్యం వహిస్తున్నాడని జిల్లా కేంద్రంలోని చేనేత సహకార సంఘం లాల్ కమాన్ టు గాంధీ రోడ్ పర్సన్ ఇంచార్జ్‌గా ఉన్న జిల్లా చేనేత అధికారి సంతోష్‌కుమార్ కార్మికులకు ఉపాధి కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, దీంతో తమకు గత పది రోజులుగా ఉపాధి లేదని, ఫలితంగా పండుగ వేళ పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడిందని చేనేత నేతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేతల కోసం కృషి చేస్తుంటే కింది స్థాయి అధికారుల కారణంతా తాము ఉపాధి కోల్పోతున్నామని, తక్షణమే కలెక్టర్, మంత్రి స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

## కార్యకర్తల కుటుంబాలకు ఏఎంసి ఛైర్మన్ పరామర్శ



గజ్వేల్, అక్టోబర్ 27, మనం న్యూస్ః గజ్వేల్ మండలంలోని జాలిగామ గ్రామానికి చెందిన కుమ్మరి కనకయ్య, వారి కుమారుడు భాస్కర్ ఇటీవల కరెంటు షాక్‌తో ఇద్దరు మరణించగా బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బెండె మధుతో కలిసి ఏఎంసి ఛైర్మన్ మాదాసు శ్రీనివాస్ పరామర్శించారు. వారి మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. ఈ సందర్భంగా వారికి రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని మంత్రి హరీష్‌రావు ఆదేశానుసారం అందించడం జరిగిందన్నారు. అదేవిధంగా శేరిపల్లి గ్రామానికి చెందిన మంద భూపాల్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాన్ని, రిమ్మనగూడ గ్రామానికి చెందిన ఎంకపల్లి రాజయ్య మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. కార్యకర్తలకు బిఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ బొల్లారం ఎల్లయ్య, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, సర్పంచ్ శివయ్య, ఎంపిటిసి రాజిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాల విమర్శలు




జగదేవ్‌పూర్, అక్టోబర్ 27, మనం న్యూస్ః గజ్వేల్ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీజేపి, కాంగ్రెస్ నేతలు బిఆర్ఎస్‌పై అనవసర విమర్శలు చేస్తున్నాయని, పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధిని చూసి ఓర్వలేక సీఎం కేసీఆర్‌పై బురద చల్లుతున్నారని పిఎసిఎస్ ఛైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు నరేష్ అన్నారు. శుక్రవారం జగదేవ్‌పూర్‌లోని బిఆర్ఎస్ కార్యాలయంలో వారు మాట్లాడారు. ప్రజలు ప్రతిపక్షాల మాయలో పడి అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను మర్చిపోవద్దని, గజ్వేల్ అభివృద్ధి చూసి ఓర్వలేక బీజేపి, కాంగ్రెస్ నేతలు లేనిపోని ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ హయాంలో గజ్వేల్ అన్ని రకాలుగా అభివృద్ధి చెందిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో రైతుల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. రైతుబీమా, 24 గంటల ఉచిత కరెంటు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. అలాగే అన్ని కులాల వారికి సంక్షేమ ఫలాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేశారన్నారు. సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముచ్చటగా గజ్వేల్‌లో భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో ఎంపిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షులు కిరణ్ గౌడ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్లు వెంకట్రామిరెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లను పట్టించుకోని పార్టీలను ఓటుతో బొందపెట్టాలి

### ముదిరాజ్ హక్కుల చైతన్య సైకిల్ ర్యాలీ



దుబ్బాక, అక్టోబర్ 27, మనం న్యూస్ః ముదిరాజ్‌లను రాజకీయంగా ఎదగనీయకుండా పట్టించుకోనటువంటి పార్టీలను ఓటుతో బొందపెట్టాలని ముదిరాజ్ హక్కుల చైతన్య నాయకులు దివిటి రాయిని సత్తయ్య ముదిరాజ్ (చికెన్ సత్తి) అన్నారు. శుక్రవారం ముదిరాజ్ హక్కుల చైతన్య సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ ప్రారంభోత్సవానికి జిల్లా ముదిరాజ్ జేఏసి నాయకులు హాజరై జెండా ఊపి సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్‌ల గురించి పట్టించుకోని పార్టీలను బొందపెట్టాలన్నారు. తరాలు మారుతున్నా ముదిరాజ్‌ల తలరాతలు మారడం లేదన్నారు. ముదిరాజ్‌లను ఓట్ల కోసం వాడుకుంటున్నారు తప్ప న్యాయం చేయడం లేదన్నారు. ముదిరాజ్‌ల హక్కుల కోసం ఎవరైతే హామీ ఇస్తారో ఆ పార్టీకే ముదిరాజ్‌ల మద్ధతు ఉంటుందన్నారు. త్వరలోజిల్లా ముదిరాజ్ జేఏసి పక్షాన అన్ని పార్టీల రాష్ట్ర అధ్యక్షులను కలసి ముదిరాజ్ జాతి హక్కులతో కూడిన మెమోరాండం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగిటి శ్రీనివాస్, జేఏసి జిల్లా ఛైర్మన్ గుంటుకు శ్రీనివాస్, కౌకూరు సూరన్న, నియోజకవర్గ జేఏసి ఛైర్మన్ పడిగె ప్రశాంత్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ పార్టీకి షాక్...



-కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

-కండువా కప్పి ఆహ్వానించిన కాట శ్రీనివాస్ గౌడ్

జిన్నారం, అక్టోబర్ 27, మనం న్యూస్‌: బిఆర్‌ఎస్ పార్టీకి అసమ్మతి నేతలు ఝలక్ ఇస్తున్నారు. రోజురోజుకు కాంగ్రెస్‌లో చేరికల సంఖ్య పెరుగుతుంది. పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచింది. జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామం బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రాములు, వారి అనుచరులు 200 మంది పార్టీని వీడి కాటా శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ శ్రీనివాస్ గౌడ్ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ వస్తే నీళ్లు, నిధులు, నియామకాలు అని చెప్పి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత వారి కుటుంబం మాత్రమే అన్ని రకాలుగా లబ్ధి పొందిందని, ఏ ఒక్క నిరుద్యోగికి ఉద్యోగం రాలేదన్నారు. రాబోయేది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే అన్నారు. బిఆర్‌ఎస్ పాలనతో ప్రజలు , నాయకులు విరక్తి చెంది కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. సోనియాగాంధీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ అధికారంఓలకి వస్తుందన్నారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్ బిఆర్‌ఎస్ పార్టీకి పతనం



ప్రారంభమైందన్నారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు సమాన అభివృద్ధి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షులు వడ్డె కృష్ణ నర్సింగరావు, ఎంపిపి రవిందర్ గౌడ్, ఎంపిటిసి గోవర్ధన్, ఉపాధ్యక్షులు రాజు గౌడ్, లక్ష్మణ్, మున్సిపల్ అద్యక్షులు జైపాల్‌రెడ్డి, జనరల్ సెక్రటరీలు సత్యనారాయణ, లక్ష్మారెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.



## తప్పుడు పోస్టులు పెడితే చట్టరీత్యా చర్యలు తప్పవు

### సిద్దిపేట పోలీస్ కమీషనర్ శ్వేత



సిద్దిపేట, అక్టోబర్ 27, మనం న్యూస్ ప్రతినిధిః ఎన్నికలు సమీపిస్తున్న వేళ సోషల్ మీడియాలో విద్వేష పూరిత, తప్పుడు పోస్టులు పెడితే సదరు వ్యక్తులపై చ ట్టరీత్యా చర్యలు తీసుకో వడం జరుగుతుందని పోలీస్ కమీషనర్ శ్వేత అ న్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ యువత భవిష్యత్తు దృష్టిలో ఉంచు కొని నడుచుకో వాలని, సోషల్ మీడియాలో అనవసరమైన పోస్టులు పెట్టి ఇతరులను ఇబ్బంది పెట్టవద్దని, వారు ఇబ్బంది పడవద్దని భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకకరమైన చిత్రా లు, వీడియోలు, పోస్ట్ చేయవద్దని, వ్యక్తిగత దూషణకు దిగడం, వార్నింగ్ ఇవ్వ డం, అంతర్గత వివరాల గురించి అనవసర పోస్టులు, కామెంట్‌లు చేయరాదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యహరించడం జరుగుతుందన్నారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసేటప్పుడు జాగ్రత్తతో అప్రమత్తంగా వ్యవహ రించాలని, లేదంటే పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. విద్వేషకర పోస్టులు చేసినా, షేర్ చేసినా వారి సమాచారాన్ని సిద్దిపేట పోలీస్ కమీషనర్ కంట్రోల్ రూమ్ వాట్సప్ నెంబర్ 87126 67100కుతెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## చింతా ప్రభాకర్‌కే మా మద్ధతు

### బిసి సెల్ మండలాధ్యక్షులు రవికుమార్



సంగారెడ్డి, అక్టోబర్ 27, మనం న్యూస్‌: చింతా ప్రభాకర్‌కే మా మద్ధతు అని బిసి సెల్ మండల అధ్యక్షులు రవికుమార్ అన్నారు. సదాశివపేట మండలంలో శుక్రవారం నాగ్సాన్‌పల్లి బిఆర్‌ఎస్ బిసి సెల్ మండల అధ్యక్షులు రవికుమార్ తన అనుచరులతో టిఎస్‌హెచ్‌డిసి ఛైర్మన్, బిఆర్‌ఎస్ అభ్యర్థి చింత ప్రభాకర్‌ను కలిసి తమ మద్ధతు ప్రకటించారు.ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల్లో ఉండే వ్యక్తి, ప్రజల కోసం తన ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా ప్రజా సేవ చేయడమనేది చాలా ఉత్తమమన్నారు.చింతా ప్రభాకర్ ద్వారానే తమ గ్రామం అభివృద్ధి చెందిందన్నారు. 24 గంటలు అందుబాటులో ఉండి తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేసే చింత ప్రభాకర్‌ను ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొత్తగొల్ల ఆంజనేయులు, గ్రామ ఉపాధ్యక్షులు కృష్ణ, నర్సింలు, ఆంజనేయులు గౌడ్, వార్డు మెంబర్ బిక్షపతి, రవి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఎలాంటి అభివృద్ధి చేయలేదు

### బీజేపి అభ్యర్థి నందీశ్వర్ గౌడ్



రామచంద్రాపురం, అక్టోబర్ 27, మనం న్యూస్ ప్రతినిధిః ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని, నియోజకవర్గ అభివృద్ధి బీజేపితోనే సాధ్యమని బీజేపి అభ్యర్థి నందీశ్వర్ గౌడ్ అన్నారు. శుక్రవారం బీజేపి కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు బీజేపి అధిష్టానం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, ప్రస్తుత ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. సీఎం కేసీఆర్‌ను ఒప్పించి ఏదైనా చేశావా అంటూ మహిపాల్‌రెడ్డికి సూటి ప్రశ్న వేశారు. కబ్జా చేయడం, పేదల భూములను అన్యాక్రాంతం చేయడం తప్ప గూడెం మహిపాల్‌రెడ్డి చేసిందేమీ లేదన్నారు. పదేళ్లలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు. ఓట్లను డబ్బులు పెట్టి కొనేందుకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కుట్ర పన్నుతున్నారని, పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవిందర్, సహదేవ్, కౌన్సిలర్ శంషాద్‌రాజు, ఆగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బలరామ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వహించాలి




### -సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం
### -ప్రచార సరళిని, ఎన్నికల వ్యయాన్ని నిశితంగా పరిశీలించాలి
### -జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శరత్

సంగారెడ్డి, అక్టోబర్ 27, మనం న్యూస్: ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు ఎన్నికల విదులను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శరత్ సూచించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా శుక్రవారం సెక్టోరల్ అధికారులు, స్టాటిక్ సర్వైలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, సహాయ వ్యయ పరిశీలకులు తదితర నిఘా బృందాల అధికారులకు ఆయన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రచార సరళి పరిశీలన, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే చర్యలను నిరోధించడం, ఫిర్యాదులపై తక్షణమే సపదించడం వంటి వాటిపై దిశా నిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిఘా బృందాలు సమర్ధవంతంగా నిబద్ధతతో విదులు నిర్వహించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని, ఎలాంటి ఫిర్యాదులు రాకుండా పక్కాగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన వారిపై వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల వ్యయం, ప్రచార సరళిపై నిఘా బృందాలు నిత్యం నిఘా ఉంచాలని, స్టాటిక్ సర్వైలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు సమకూర్చిన వాహనాలకు అత్యాధునిక పిటిజి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నగదు జప్తు చ ఏసిన సందర్భాల్లో తప్పనిసరిగా రశీదులు అందించాలని, తగిన ఆధారాలు చూపించి నగదును విడిపించుకోవచ్చని వివరించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమని, ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు వారి పాత్ర ఉంటుందన్నారు. అధికారులు తమతమ సెక్టార్లలో గల పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండేలా చూసుకోవాలని, ఓటర్ టర్న్ ఔట్ తక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలు గుర్తించి అవగాహన కల్పించాలన్నారు. మోడల్ పోలింగ్ కేంద్రాలు, యూత్, పిడబ్ల్యూడి పోలింగ్ కేంద్రాలు, వాటి నిర్వహణ సిబ్బంది తదితరాలను చూసుకోవాలన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషి చేయాలన్నా. ఈ సమావేశంలో ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ నగేష డిసిఓ ప్రసాద్, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## మృతుల కుటుంబాలకు ఎఫ్‌డిసి ఛైర్మన్ పరామర్శ

జగదేవ్‌పూర్, అక్టోబర్ 27, మనం న్యూస్: జగదేవ్‌పూర్ మండల పరిధిలోని వట్టిపల్లి గ్రామంలో తుడుం ఆశీర్వాదం (55), గోలి నవీన్ (25)లు అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి శుక్రవారం వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబాలకు అండగా ఉంటామని, అధైర్యపడవద్దని ఆయన ధైర్యం కల్పించారు.



## దొడ్డి కొమురయ్య చరిత్రను అంతా తెలుసుకోవాలి

### చిత్ర నిర్మాణ కరపత్ర ఆవిష్కరణలో చిత్ర దర్శకులు సేనాపతి



సిద్దిపేట రూరల్, అక్టోబర్ 27, మనం న్యూస్: దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని దొడ్డి కొమురయ్య చిత్ర దర్శకులు సేనాపతి అన్నారు. శుక్రవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో దొడ్డి కొమురయ్య చిత్ర నిర్మాణ కరపత్ర ఆవిష్కరణలో ఆయన హాజరై చిత్ర నిర్మాణ కమిటీ జిల్లా ఛైర్మన్ సింగోజు మురళీకృష్ణ ఆచార్యులతో కలిసి కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనం కోసం బ్రతికి జనం కోసం అంకితమైన గొప్ప పోరాట యోధుడి చరిత్రను సినిమా రూపంలో తీసుకువచ్చి అందరికీ తెలిసేలా సినిమాను రూపొందిస్తున్నామని, ఈ సినిమా నిర్మాణంలో ప్రతి జిల్లాకు 30 మందికి సహ నిర్మాతలుగా అవకాశం కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని నియోజకవర్గ కమిటీల విస్తరణకు గానీ, సినిమా సహ నిర్మాతలుగా వ్యవహరించడానికి ఉత్సాహం, అంకితభావం కలిగిన వారు మురళీకృష్ణ ఆచార్యులను సంప్రదించానలి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది మహనీయులు, త్యాగధనుల పోరాట ఫలితమే మన స్వేచ్ఛా జీవితమని, ఈ తరుణంలో మనకోసం తమ ప్రాణాలను అర్పించిన పోరాట యోధులు, మహనీయుల చరిత్రను తెలుసుకోవడం తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయాల కుల సంఘాల ప్రతినిధులు బోయ రాములు, కొత్త కృష్ణమూర్తి, శ్రవణ్, అనిల్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 29న కాంగ్రెస్ బహిరంగ సభను జయప్రదం చేయాలి

### -నాలుగు వేల ద్విచక్ర వాహనాలో నేతలకు ఘన స్వాగతం
### -ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సంగారెడ్డి, అక్టోబర్ 27, మనం న్యూస్: ఈనెల 29వ తేదీన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభను విజయవంతం చేయాలని, 4 వేల ద్విచక్ర వాహనాలతో నేతలకు భారీ ఘన స్వాగతం పలకాలని ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. కొండాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్ చింతల్ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఏఐసిసి కార్యకర్తల సమావేశం జగ్గారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29న సంగారెడ్డి గంజి మైదానంలో జరిగే కాంగ్రెస్ బహిరంగ సభకు ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, సిఎల్పీ బట్టి విక్రమార్క, మాజీ డిప్యూటీ సీఎం దామోదర్ రాజనర్సింహా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరవుతారని, కావున ప్రతి మండలం నుండి 5 వేల నుండి 8 వేల మది బహిరంగ సభకు హాజరు కావాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. భారీ ఎత్తున 50 వేల మందితో బైర్‌ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అద్యక్షులు ప్రభు, కొండాపూర్ ఎంపిటిసి నరసింహారెడ్డి, మల్కాపూర్ ఎంపిటిసి భాస్కర్‌రెడ్డి, సనరల్ సెక్రటరీ నర్సింలు, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుదాస్, మండల యువజన అధ్యక్షులు సునీల్, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, సడాకుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.